
# చిల్లర కథ

— చంద్రం




ఉన్నపళంగా ఊరు బయలుదేరవలసి వచ్చింది.

హడావుడి ప్రయాణాలలో కొన్ని అనర్థాలు తప్పవు. కావాలంటే ఈ ప్రయాణం ఆపుకోవచ్చు. కాని, ఆగిపోవటానికి తగినంత కారణం లేకపోవడంవల్ల ఊరెళ్ళటానికే నిశ్చయించుకున్నాను.

ఇరవై నిమిషాలలో బండి వుంది.

నడిచి వెళ్తే అందదు. రిక్షా పిలిచాను.

ఐదు రూపాయలడిగాడు.

నా దృష్టిలో మూడు చాలు!

మూడు రూపాయలన్నమాట నా నోటి నుంచి బయటికి రాగానే అతను ఓ నిరసన చూపు నావైపు విసిరి, రిక్షా ముందుకు నడిపించాడు.

ఇది రిక్షా ఎక్కే మొకమేనా? అన్న భావం ఆ చూపులో స్ఫురించింది నాకు. కాని, రిక్షావాలా చూపులకు భాష్యం చెప్పకుని, తీరిగ్గా విచారించే సావకాశం నాకు లేకపోయింది. కనుచూపుమేరలో మరో రిక్షా లేదు. ఈ రిక్షాని పోలిస్తే బండికి అందుకోవటం కష్టం. కనుక బెట్టుసరికి పోక నేనే ఒక మెట్టు కిందికి దిగి చప్పట్లు చరిచాను.

అప్పటికే అల్లంత దూరం వెళ్ళిపోయిన రిక్షావాలా వేగం తగ్గించి తల వెనక్కి తిప్పి చూశాడు.

నోటితో అరవకుండా చెయ్యి పైకెత్తి నాలుగు వేళ్ళు చూపించాను.

రిక్షా ఆగింది. కాని వెనక్కు తిరగలేదు.

నేనే వేగంగా నడిచివెళ్ళి రిక్షా ఎక్కి చూకున్నాను.

మొయ్యలేనంత లగేజీ వుంటే తప్ప రిక్షా ఎక్కే అలవాటు లేదు నాకు. ఇప్పడు లగేజీ లేకపోయినా, బండిని సకాలంలో అందుకోవటం కోసం రిక్షా ఎక్కక తప్పలేదు.

దైనందిన జీవితంలో చాలా సందర్భాలలో 'బేరం' అనేది సర్వ సాధారణమైపోయింది. రిక్షా కిరాయి విషయంలో కూడా బేరం ఆడక తప్పటం లేదు. ఎలాగూ బేరం ఆడుతారు కదా అని రిక్షావాలా ఎక్కువ చెప్పటం, ప్రయాణీకులు తగ్గించి అడగటం–తర్జన భర్జనలు–వాగ్వివాదాలూ మామూలే.

అత నడిగిన ఐదు రూపాయిలు నా దృష్టిలో ఎక్కువ. అందుకే మూడన్నాను. మరో రూపాయి ఎక్కువిమ్మని అతనడిగి వుండాల్సింది. కాని, అందుబాటులో మరో రిక్షా లేకపోవటంవల్ల, అవసరాన్ని బట్టి నేనే రేటు పెంచి తీరుతానని అతని ధీమా! జరిగింది కూడా అదే!

మూడు రూపాయిలన్నప్పడు నిరసనగా చూడటమేకాదు–నేనిస్తానన్న నాలుగు రూపాయిలకు అంగీకరించిన తర్వాత కూడా రిక్షా వెనక్కు తిప్పి నా దగ్గరకు రాలేదతను. నేనే పరుగెత్తి రిక్షాని సమీపించాను. అవసరం నాది మరి!

అతను ఐదు చెప్పటం, నేను మూడు అనటం, ఇద్దరికీ నాలుగు దగ్గర అంగీకారం కుదరటం–ఇదేకదా బేరంలోని పరమార్థం.

స్టేషన్ ముందు రిక్షా దిగేసరికి బండి ప్లాట్‌ఫారం మీదికి వచ్చేసింది.

ఐదు నోటు తీసిస్తే రూపాయి లేదన్నాడు రిక్షావాలా.

ఉంచుకునే లేదన్నాడేమో!

జేబులు వెతికితే నా దగ్గరా చిల్లర లేదు. ఎక్కడైనా మార్చి యిచ్చే వ్యవధి లేదు–బండి ప్లాట్‌ఫారం మీదికి వచ్చేసి వుంది. మారు మాట్లాడకుండా ఐదు నోట రిక్షావాలా చేతిలో పెట్టి, బుకింగ్ వైపు పరుగు తీశాను.

రిక్షా కిరాయి విషయంలో బేరం ఆడే ఫలితం లేకపోయింది. విధం చెడ్డా ఫలం దక్కనే లేదంటారు యిలాంటి సందర్భాలలోనే!

అదృష్టవశాత్తు బుకింగ్ దగ్గర రద్దీ లేదు.

పది నోటిచ్చి టికెట్ అడిగాను.

అక్కడా చిల్లర సమస్యే!

టికెట్ వెల తొమ్మది రూపాయలు. కౌంటర్‌లో రూపాయి లేదట! నా దగ్గర తొమ్మిది రూపాయల చిల్లరెక్కడుంది? చిల్లర లేకనేకదా రిక్షావాలాకి ఐదు నోటిచ్చి చక్కా వచ్చింది! పోనీ విడి రూపాయివున్నా సరిపోయేది–అతని వద్ద రెండు నోటుంది!

ఈలోగా బండి కూతేసి హెచ్చరించింది. చేసేదిలేక రూపాయికి నీళ్ళొదిలేసి, టికెట్ తీసుకుని ప్లాట్‌ఫారం మీదికి పరుగెత్తాను.

కదులుతున్న బండి ఎక్కటం ప్రమాదకరమని తెలీకనా? తెలిసే ఎక్కాల్సి వచ్చింది!

ప్రయాణ సమయాలలో తగినంత చిల్లర దగ్గరుంచుకోవటం మంచిదన్న సంగతి కూడా నాకు బాగా తెలుసు. అది నా అలవాటు కూడాను. కాని, హడావుడిగా బయలుదేరటంవల్ల జాగ్రత్త పడలేకపోయాను.

అడుగడుగనా చిల్లర సమస్యే!